ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

గౌడల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి: మల్లేశం గౌడ్





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 223 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 08 ఆగస్టు 2026

# 10న 'సాగర్'లో వరుణయాగం

● తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ● పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్



**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు మిగతా2లో...



# తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం

బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు.

మిగతా2లో...




# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

● చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు ● బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం

● కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**జైపూర్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మిగతా2లో...



# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై మిగతా2లో...

# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి




# మనం నాటే మొక్క... భవిష్యత్ తరాలకు మేలు

చేనేత వస్త్రాలు వినియోగించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు




# రైతులు ఆందోళన చెందొద్దు

- కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించి తీరుతాం : మంత్రి జూపల్లి కృష్ణారావు




# నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

చార్జ్‌షీట్‌లో సీబీఐ స్పష్టం 20 వేల పేజీల ఆధారాలు

ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సమర్పించినట్టు వెల్లడి

ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలున్నట్టు గుర్తించిన ఏసీబీ అధికారులు




# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

● గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు ● ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక ● లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ మిగతా2లో...



# నేతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ సర్కారు

బీజేపీ నిర్ణయాలతో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

5 శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి

చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ

**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల కడుపు కొడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నేతన్నల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ హయాంలో అమలైన మిగతా2లో...

# చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు.

జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

**న్యూఢిల్లీ,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ యూజీ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటూ న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన సుదీర్ఘ పోరాటం విజయాన్ని సాధించింది. ఎట్టకేలకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే 2026 నీట్ యూజీ పేపర్ ఎలా లీకైందన్న అంశంపై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సీబీఐ ఓ నివేదికను తయారు చేసింది. సీబీఐ ఛార్జ్‌షీట్ వివరాల ప్రకారం ... ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారు. **క్వశ్చన్ పేపర్ల తయారీ బృందంలో ఆ ముగ్గురు ....**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సంబంధించిన బృందంలోని ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు పేపర్ లీకేజీకి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే బృందంలో ఆ ముగ్గురూ ఉన్నారనీ, పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హవల్దార్.. అనే ముగ్గురు నీట్ యూజీ పేపర్ లీకేజీకి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపింది. కెమిస్ట్రీ సబ్జెక్టులో కులకర్ణి నిపుణుడు. వృక్ష శాస్త్రంలో మాంధారే, భౌతిక శాస్త్రంలో హవల్దార్ నిపుణులు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మంది నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఎన్టీఏ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో... ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కాపీ చేసి వాటిని చీటీలపై రాసుకున్నారనీ, కొన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్టు సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా వివరించింది. **డిజిటల్ వాడకుండా ...**ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారనీ, అయితే ఈ ప్రక్రియ డిజిటల్ విధానాలను వాడకుండా .. నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపింది. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్ రేటును పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సీబీఐ పేర్కొన్నది. ప్రయివేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్టు కూడా సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్తం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని ఛార్జ్‌షీట్‌లో సీబీఐ అధికారులు తెలిపారు.**అనేక బ్యాంక్ అకౌంట్లు, లాకర్లు, డీమాట్ అకౌంట్లు సీజ్ ..!** గత మే 12 వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సీబీఐ విచారణకు సహకరించారని తెలిపింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లోని 92 ప్రాంతాలలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సీబీఐ వెల్లడించింది. మే 13వ తేదీన ఈ కేసులో తొలి నిందితుడిని అరెస్టు చేశారు. కోచింగ్ సెంటర్లకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సీబీఐ తన రిపోర్టులో పేర్కొన్నది.**360 మంది సాక్షులు.. 13 మంది నిందితులు..** ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించామన్నారు. ఎన్టీఏ కేంద్రం వద్ద చెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేవని తెలిపారు. పీవీ కులకర్ణి ఈ కేసులో ఏ2 నిందితుడని, అతను మూడు సెట్ల ప్రశ్నాపత్రాలకు చెందిన ట్రాన్స్‌లేషన్ వర్క్ కూడా చేశారని తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో అతను 135 ప్రశ్నలను ట్రాన్స్‌లేట్ చేశాడని తన ఛార్జ్‌షీట్‌లో సీబీఐ పేర్కొన్నది. 13 మంది నిందితుల్లో ముగ్గురు ఎన్టీఏ సబ్జెక్ట్ నిపుణులు, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారని తెలిపింది. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్లు గుర్తించామన్నారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ సమర్పించింది. విచారణలో భాగంగా 360 మంది సాక్ష్యులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందనీ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ (జనరల్) రమేష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పై నుంచి వస్తున్న నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం కిందికి విడుదల చేస్తున్నారని చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ ఒత్తిడితోనే అధికారులు నీటిని విడుదల చేశారంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, ఆ జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు నీరివ్వటం లేదంటూ గులాబీ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. రేవంత్, ఉత్తమ్ సారధ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. లక్షల ఎకరాలకు సాగునీరందించే ఆ ప్రాజెక్టులను పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

### హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం


(మొదటి పేజీ తరువాయి)

ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది

**● మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం ● ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన వ్యవస్థ**

**● కాంగ్రెస్ నిర్లక్ష్యంతో నిర్వీర్యం : మాజీమంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన సుజల వ్యవస్థగా పేరుగాంచిందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజు గొప్ప ఆలోచనతో ప్రారంభమైన ఈ పథకం ప్రజల తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచి హర్ ఘర్ జల్ పథకం అయిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఒక పథకం కాదనీ, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన మహత్తరమైన ప్రణాళిక అని వివరించారు.రాష్ట్రంలో ఏ ఇంట్లోనూ తాగునీటి కోసం ఇబ్బంది ఉండకూడదనీ, ఏ తల్లి కూడా బిందె పట్టుకుని కిలోమీటర్ల దూరం నడవకూడదనీ, ఏ గ్రామం కూడా వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోకూడదనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ది: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

(మొదటి పేజీ తరువాయి)

కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## 10న 'సాగర్'లో వరుణయాగం

(మొదటి పేజీ తరువాయి)

11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరో సారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.ద

## నేతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

చేనేత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదని తెలిపారు. చేనేత రంగం విషయంలో బీజేపీ-కాంగ్రెస్ వైఖరి ఒక్కటేనని విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతోనూ నేతన్నలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని తెలిపారు. చేనేత రంగానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తేయడం, చేనేత ఉత్పత్తులపై ఐదు శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు.

## మనం నాటే మొక్క... భవిష్యత్ తరాలకు మేలు

**హుస్నాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మార్కండేయ ఆలయంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వన మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. "చేనేత వస్త్రాలు ప్రోత్సహిస్తామని, చేనేత వస్త్రాలు ధరిస్తామని" జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల మరణించిన చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అతిథులకు శాలువాల కప్పే బదులు చేనేత కార్మికులు నేసే వస్త్రాలను వాడాలన్నారు. దీని వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు నేతన్నకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే చేనేత వస్త్రాలు ఉపయోగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేవారని, మా ప్రభుత్వం తరుపున ఎప్పటికప్పుడు అండగా ఉంటూ ఉపాధి అవకాశాలు పెంచుతూ వారికి ఆర్థికంగా భరోసా ఇస్తున్నామన్నారు. ఆర్థిక పరమైన ఏ అంశాలు పెండింగ్‌లో లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో బిఎఫ్ఎస్ఐ, ఫిన్‌టెక్ రంగాల్లో కెరీర్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం

**హనుమకొండ, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలోని TSKC,Placement Cell ఆధ్వర్యంలో, TNS India Foundation, ముంబై సహకారంతో "Campus to Tech`Enabled Financial Careers (C2FC)" కార్యక్రమంపై అవగాహన సదస్సును శుక్రవారం కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఫిన్‌టెక్ రంగాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో ఝాఖజ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎ. అనిల్ కుమార్ అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులను ఆహ్వానించి కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. C2FC కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఉచిత



పరిశ్రమ ఆధారిత శిక్షణ, కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలు, ప్లేస్‌మెంట్ సహాయం అందించబడుతుందని తెలిపారు. TNS India Foundation ప్రతినిధులు శ్రీ ఇషాన్ సింగ్, శ్రీ సౌరభ్ పాండే విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జ2ఖీజ కార్యక్రమం, అర్హతలు, శిక్షణ విధానం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఫిన్‌టెక్ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు, ప్లేస్‌మెంట్ సహాయం తదితర అంశాలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమంలో నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డా. రజని లత, డా. డి. రాజశేఖర్,




IQAC కోఆర్డినేటర్ డా. శ్రీనాథ్, డా. ఎం.డి. యాకూబ్, డా. బి. శ్రీనివాస్, డా. గంగిశెట్టి, డా. జి.కె. కుమార్,సాగర్, నవీన్, బాలు, వినయ్, వందన తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బి.కాం, బి.బి.ఏ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొని, కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చివరగా డా. శ్రీకాంత్ వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముగిసింది. డా. ఎ. అనిల్ కుమార్ TSKC కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కాకతీ య ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ

# గౌడల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి: మల్లేశం గౌడ్



**పరకాల, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** గౌడ కులస్తులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ డిమాండ్ చేశారు. పరకాల మండలంలోని కామారెడ్డిపల్లెపోచారంరాజుపేట గ్రామాల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమరుల యాదిలో' బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ, కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటాపోతుల రమణ నాయకత్వంలో చేపట్టిన బస్సు యాత్రకు గౌడ కులస్తులు పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆగస్టు 16న పరకాలకు చేరుకోనున్న నేపథ్యంలో గౌడ కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షులు తండ కుమారస్వామి, అయిలి రమేష్, పబ్బ సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు మార్క రఘుపతి గౌడ్, బుర్ర రాజమౌళి గౌడ్, నాయకులు గునిగంటి రవి గౌడ్, బుర్ర రామ్మూర్తి గౌడ్, పరకాల మండల ఉపాధ్యక్షుడు గాజర్ల రాజేందర్, పబ్బా శ్రీనివాస్‌తో పాటు కామారెడ్డిపల్లె, పోచారం, రాజుపేట గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# 11వ వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించాలి



## ప్రమాదకరంగా మారిన ఐరన్ స్తంభం..
## డ్రైనేజీ, చెత్త సమస్యలతో ప్రజల ఇబ్బందులు

**ఏటూరునాగారం, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపురం గ్రామంలోని 11వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు గ్రామపంచాయతీ అధికారులను కోరుతున్నారు. 11వ వార్డులో ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభం పూర్తిగా తుప్పుపట్టి క్షీణించిన స్థితిలో ఉందని, ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే మార్గం గుండా ప్రతిరోజూ సి.ఎస్.ఐ. పాఠశాల వ్యాన్ రాకపోకలు సాగుతుండటంతో పాటు చిన్నారులు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. బలమైన గాలులు వీచిన సమయంలో స్తంభం కూలి ప్రమాదం జరిగే



అవకాశం ఉన్నందున వెంటనే తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ ఈ గల్లీలోకి రాకపోవడంతో ప్రజలు వేసిన చెత్త అక్కడికక్కడే పేరుకుపోతోందని వాపోతున్నారు. దీంతో పందులు సంచరిస్తుండటంతో పాటు దుర్వాసన, దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందుకే ఆ ప్రాంతంలో చెత్త సేకరణ కోసం ఒక డస్ట్‌బిన్ లేదా చెత్త డ్రమ్ము ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 11వ వార్డులో సరైన కాలువలు లేకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్డుపైనే ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. ఇటీవల వేసిన సీసీ రోడ్డుకు షోల్డర్లు వేయకపోవడంతో రహదారి పక్కలు ఎత్తు తేడాగా మారాయని, పిల్లలను బైక్‌లపై పాఠశాలకు తీసుకెళ్లే తల్లిదండ్రులు తరచూ జారి పడుతున్నారని తెలిపారు. రోడ్డుకు షోల్డర్లు వేసి,



లెవెలింగ్ పనులు చేపట్టాలని 11వ వార్డు ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



# బడుగు కుటుంబానికి అండగా నిలిచిన బీఎస్పీ నాయకులు డాక్టర్ అంబాల ప్రభాకర్



**జమ్మికుంట, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆపదలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్న బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబాద్ అసెంబ్లీ ఇంచార్జీ డాక్టర్ అంబాల ప్రభాకర్. జమ్మికుంట మండలం, సైదాబాద్ గ్రామానికి చెందిన దొగ్గేల సుమలత నరేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు వారి దాంపత్య జీవితం మంచిగా కొనసాగుతుండగా సుమారు ఐదు సంవత్సరాల క్రితం సుమలత అనే మహిళ మెదడు సంబంధిత తీవ్రమైన అనారోగ్యానికి గురై నాలుగు సార్లు శస్త్రచికిత్స చేయించుకోగా లక్షల్లో అప్పులు అయ్యాయి. ఆ క్లిష్ట పరిస్థితిలో దాతల సహకారంతో ఆమెకు ఆర్థిక సహాయం అందేలా డాక్టర్ అంబాల ప్రభాకర్ కృషి చేసినట్లు తెలిపారు. అలాగే, జమ్మికుంట సెయింట్ జోసెఫ్ హై స్కూల్ కరస్పాండెంట్ సునీల్ సహకారంతో ఎలాంటి ఫీజులు లేకుండా ఆమె ఇద్దరు పిల్లలకు గత ఐదు సంవత్సరాలుగా నాణ్యమైన ఉచిత విద్య పాటు ఉచిత బస్సు సౌకర్యం అందేలా కృషి చేసినట్లు తెలిపారు. పండుగలు, పుట్టిన రోజులు వంటి సందర్భాల్లో పిల్లలకు కొత్త దుస్తులు అందిస్తూ వారి అవసరాలను తీర్చేందుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పరిస్థితులు మరింత విషమంగా మారిన నేపథ్యంలో, కుటుంబానికి భద్రతగా ఉండవలసిన తండ్రి ఆడపిల్లలపై అసభ్యంగా ప్రవర్తించడంతో ఇటీవల జమ్మికుంట పోక్సో చట్టం కింద కేసు నమోదై ప్రస్తుతం జైలులో ఉన్నట్లు తెలిపారు. జైల్ నుండి విడుదలైన తరువాత తనను తన పిల్లలను చంపుతాడని భయంతో ప్రభు ను ఆశ్రయించినట్లు తెలిపారు. పిల్లల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నానని చెప్పారు. అంతే కాకుండా ఈ కుటుంబానికి ఇంకా ఆర్థిక సహాయం, పిల్లల విద్య, పోషణ కోసం దాతల సహకారం అవసరమని డాక్టర్ అంబాల ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి ఈ తల్లిబిడ్డలకు అండగా నిలవాలని కోరారు.

# ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 7(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబ్నగర్ పట్టణం సాయిబాబా దేవాలయం లో జరిగిన తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం మహబూబ్నగర్ జిల్లా శాఖ ఆవిర్భావం సందర్భంగా ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ హాజరయ్యారు. ఈ సమావేశంలో అర్చక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అన్నావజల ప్రసాద్ శర్మ మాట్లాడుతూ అర్చకులు అందరికీ ఉద్యోగ భద్రత మరియు అర్చకుల సంక్షేమం కొరకై ఈ సంఘం ఏర్పడిందని లక్ష్యం నెరవేరేవరకు అర్చకులు అందరూ ఐక్యంగా ఉండాలని గతంలో అర్చక సంఘం పేరుతో అర్చకుల వద్ద నుండి అనేక కార్యక్రమాల పేరుతో అర్చకులు జేబులు కొల్లగొట్టారని స్వలాభ అపేక్షతో మాత్రమే పరమావధిగా పనిచేశారని సంఘ లక్ష్యాలను గాలికి వదిలేయడం వల్ల అర్చకులకు ఉద్యోగ భద్రత సంక్షేమం జరగలేదని తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం ఉద్యోగ భద్రత, అర్చక సంక్షేమం లక్ష్యాన్ని చేరుకోవడం కొరకు వివిధ జిల్లాల అర్చకులతో రూపకల్పన సాగిస్తున్నదని తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ తెలంగాణలో అర్చక క్షేమంగారే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , దేవాదాయశాఖ మంత్రిగా కొండా సురేఖ నిరంతరం అర్చకుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారి



ద్వారా దూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా నా వంతు ప్రయత్నం చేస్తానని ధూప దీప నైవేద్య దేవాలయాలను గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ గా ప్రకటించి అర్చకులను ఉద్యోగులుగా ప్రకటించే విధంగా అర్చకులు అందరూ ఐక్యంగా ఉండాలని సంఘాల పేరుతో అర్చకులు ధనాన్ని ఖర్చు చేసే వారిని దూరంగా ఉంచాలని అర్చకులకు తెలియజేశారు. తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కరణం రాజకుమార్, కార్యదర్శిగా మట్టం వంశీ తేజ, కోశాధికారి తమ్మలి రాజేశ్వరి శర్మ ఉపాధ్యక్షులుగా రాధాకాంత్, ప్రచార కార్యదర్శిగా తమ్మలి విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ లకు సంఘం నియామక పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వెగ్గలం సంతోష శాస్త్రి, కోశాధికారి గాండ్ల రవికుమార్,కార్య నిర్వహక అధ్యక్షులు తిరునగరి వెంకటాద్రి స్వామి ఉపాధ్యక్షులు జంగం మహేష్, రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యులు మఠం కుమారస్వామి, నారాయణపేట జిల్లా పంతులు నాగ స్వామి, భాస్కరాచారి, వనపర్తి జిల్లా షట్గోపం శ్రీనివాసాచార్యులు బాలకృష్ణ ఆచార్యులు , రంగారెడ్డి జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షులు జంగా సుబ్రహ్మణ్య శర్మ, కార్యదర్శి విభూది రాజేష్, ఇనామ్ దారుల అర్చక సంఘం కార్యదర్శి నంబి కృష్ణయ్య జిల్లా దూప దీప నైవేద్య అర్చకులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గ సభ్యులు అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మను శాలువతో సత్కరించారు


# బోనాల వేడుకలతో కళకళలాడిన శ్రీ వేద పాఠశాల



**శాయంపేట, ఆగస్టు7 (పిసిడబ్ల్యూ న్యూస్):**
శాయంపేట మండలం పెద్దకోడేపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో శుక్రవారం ముందస్తు బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పోతరాజు, శివసత్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తూ తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా హెచ్ఎం విజయ్ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విశిష్ట పండుగ అని అన్నారు. పండుగ విశిష్టత, ఆచారాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, మన సంస్కృతి వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తిరెడ్డి, సౌందర్య, వేదతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ రివ్యూ సమావేశం

**- పాల్గొన్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, టీపీసీసీ డోర్నకల్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అవిజ్**





**కురవి ఆగస్టు 07(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలంలోని కందికొండ స్టేజ్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) రివ్యూ సమావేశానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి టీపీసీసీ డోర్నకల్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అవిజ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో నిబద్ధతతో పనిచేసిన బీఎల్ఏలను అభినందించారు. ఆగస్టు 10తో ఓటరు నమోదు ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో మిగిలిన రోజుల్లో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న మృతుల పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు, సంబంధంలేని నమోదులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి నిర్ధారణ అనంతరమే బీఎల్ఓ వద్ద సంతకం చేయాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కష్టపడి పనిచేసిన ప్రతి బీఎల్ఏకు కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా భవాని పాఠశాలలో బోనాల వేడుకలు....







**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 07(పీసిడబ్ల్యూ న్యూస్):** భవాని పాఠశాలలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు స్వయంగా బోనాలను సిద్ధం చేసి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం బోనాల పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. "మీ ప్రతిభకు ఈ రోజు ఒక మంచి ప్రారంభం. కష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించి జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలి. మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి" అని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయం, ప్రతిభల సమ్మేళనంగా జరిగిన ఈ బోనాల వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం: బీఆర్ఎస్ లీగల్ సెల్

**- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన నాయకులు**





**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 07(పీసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమంలో విశిష్ట సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తీరని లోటని బీఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నల్లబెల్లి గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రాల వినోద్ కుమార్, జిల్లా కార్యదర్శి శివరాజ్, శ్రీరాం కిరణ్ కుమార్, పుల్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించిన నాయకుడిని చిన్న వయసులోనే కోల్పోవడం బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సీరోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్




**మహబూబాబాద్ జిల్లా,సీరోల్ (ఆగస్టు 07 పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం జిల్లా ఎస్పీ డా. శబరీష్, వార్షిక తనిఖీలో భాగంగా ఈరోజు సీరోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డులు, పోలీసింగ్ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డయల్-112 కాల్స్‌పై స్పందన, గ్రామాల సందర్శన వివరాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన సమాచార సేకరణ, గ్రామ స్థాయిలో అమలవుతున్న వి.పి.ఓ. వ్యవస్థ పనితీరు, రాత్రి పహారా, స్టేషన్ సిబ్బంది వివరాలు, రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలు, నేరాల పరిస్థితి, తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డయల్-112 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు. గ్రామాల సందర్శనలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామస్థులతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాచార సేకరణను మరింత ముమ్మరం చేసి కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. వి.పి.ఓ. వ్యవస్థను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, సైబర్ అవగాహన, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి పహారాలను పటిష్ఠంగా నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతర నిఘా ఉంచాలని, రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజల పట్ల మర్యాదపూర్వక వైఖరి, బాధ్యతాయుత సేవాభావంతో పనిచేయాలని, ప్రతి పోలీసు అధికారి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీలో డీఎస్పీ కృష్ణ కిషోర్, మరిపెడ సీఐ పవన్, సీరోలు ఎస్ఐ సంతోష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


# రాజకీయం కోసం దళిత కాలనీని బలిచేస్తున్నారా..

**రూ.1.70 కోట్ల సీసీ రోడ్ల పనులకు రాజకీయ బ్రేక్.. ప్రజల ప్రాణాల కంటే ప్రచారమే ముఖ్యమా..**

**కల్లూరు, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎర్రబోయినపల్లి గ్రామంలోని దళిత కాలనీ ప్రజలు ఏళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే నరకయాతన అనుభవిస్తున్నా, వారి బాధలు పట్టించుకునే పాలకులు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో రూ.1.70 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరైనా వాటి అమలు మాత్రం ముందుకు సాగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో, అభివృద్ధి పనులు ప్రారంభిస్తే సర్పంచ్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ లెక్కలతోనే పనులు నిలిపివేశారా.. లేక అభివృద్ధి పనుల్లో స్వార్థ ప్రయోజనాల కోసమే ఆలస్యం చేస్తున్నారా అనే ప్రశ్నలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక స్పష్టత లేకపోవడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మరో కోణములో అధికార పార్టీకి చెందిన వాడు కాదు కాబట్టి ఆ పనులు చేపడితే ఎక్కడ బిల్లులకు అడ్డు తగిలి నిలిపివేస్తారని భయంతో సర్పంచ్ వెనకడుగు వేశారా అన్న ఆలోచనలు కూడా గ్రామశీ లో వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యమంటూ నిధులు మంజూరు చేస్తుంటే, మరోవైపు స్థానిక నాయకత్వం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల దళిత కాలనీ ప్రజలు ప్రతి వర్షానికి బురద, మురుగు నీటిలోనే జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో డ్రైనేజీ, సీసీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ,



వాటి అమలులో కనిపిస్తున్న జాప్యంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కక్షలకా, అధికారుల నిర్లక్ష్యానికా, లేక మరేదైనా కారణమా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి దళిత కాలనీ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజా సమస్యలను రాజకీయాలకు బలిచేస్తున్నారనే విమర్శలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎర్ర బోయినపల్లి గ్రామం లోని డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తూ అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి 77 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందని తక్షణమే పనులు ప్రారంభించి డ్రైనేజీలు నిర్మించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. 2025 మార్చి 20వ తేదీన పలు కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా ప్రస్తుత రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయనంద్ యర్రబోయినపల్లిలోని డ్రైనేజీల నిర్మాణానికి, అంతర్గత సిసి రోడ్ల కొరకు సి ఆర్ ఆర్ నిధుల నుండి కోటి 77 లక్షల రూపాయలకి శంకుస్థాపన చేయడం జరిగింది. దాదాపు సంవత్సరం దాటినప్పటికీ ఆ నిధుల గురించి గాని, పనుల గురించి కాని పట్టించు కోకపోవడంతో గ్రామంలోని డ్రైనేజీ




వ్యవస్థ అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. డ్రైనేజ్ అస్తవ్యస్తంగా ఉండడంతో పలు కాలనీలోని నీరు రోడ్లపైకి చేరడం, లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నట్లు తెలుస్తుంది. నిధులు వచ్చిన పనులు జరగకపోవడానికి సరైన కాంట్రాక్టర్ లేదని అందుకే పనులు ప్రారంభించలేక పోతున్నామని పంచాయతీ అధికారులు తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు ప్రారంభించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు. ప్రజల సౌకర్యార్థం ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే...

# రెండవ శనివారం బడులు తెరిస్తే చర్యలు ఖాయం..!

**ప్రభుత్వ సెలవు రోజున తరగతులా..**

**ప్రైవేట్ పాఠశాలలకు హెచ్చరిక**

**నిబంధనలు అతిక్రమిస్తే షోకాజ్ నుంచి**

**గుర్తింపు రద్దు వరకు చర్యలు**

**తల్లిదండ్రుల ఫిర్యాదుతోనే**

**కదిలే విద్యాశాఖ**

**సెలవు రోజున విద్యార్థులను రప్పిస్తే**

**యాజమాన్యాలపై ఉక్కుపాదం**

**విద్యా క్యాలెండర్ తప్పనిసరిగా పాటించాల్సిందే**

**ఫిర్యాదు అందితే విచారణ.. ఉల్లంఘన**

**రుజువైతే కఠిన చర్యలు**

**ప్రత్యేక అనుమతి లేకుండా సెలవు**

**రోజున తరగతులకు అవకాశం లేదు**

**కల్లూరు, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వం నిర్దేశించిన విద్యా క్యాలెండర్, సెలవుల పట్టికను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని విద్యాశాఖ స్పష్టం చేస్తోంది. ప్రభుత్వం సెలవుగా ప్రకటించిన రెండవ శనివారం రోజున విద్యార్థులకు తరగతులు నిర్వహించడం లేదా హాజరు కావాలని




బలవంతం చేయడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలపై తల్లిదండ్రులు లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత పాఠశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపడతారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేసి యాజమాన్యం వివరణ కోరుతారు. అనంతరం వివరణ సంతృప్తికరంగా లేకపోతే హెచ్చరికలు, జరిమానాలు, గుర్తింపు నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు, అవసరమైతే పాఠశాల గుర్తింపుపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. పదేపదే ఉల్లంఘనలు జరిగితే మరింత కఠిన చర్యలు తీసుకునే అధికారం విద్యాశాఖకు ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో విద్యార్థులను బలవంతంగా పాఠశాలకు రప్పించడం, ప్రత్యేక తరగతులు లేదా ఇతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడి చేయడం, అదనపు ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలపై తల్లిదండ్రులు మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి లేదా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అయితే, విద్యాశాఖ నుంచి ముందస్తు అనుమతి లేదా ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన సందర్భాల్లో మాత్రమే సెలవు రోజున విద్యా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల శారీరిక, మానసిక విశ్రాంతిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వశీ సెలవులను నిర్దేశిస్తుందని అందువల్ల అన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కులను పరిరక్షించాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. **ఎంఈఓ పొదిలి పద్మ ఏమన్నారు** ప్రైవేట్ పాఠశాలలు రెండవ శనివారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహించినట్లు ఎవరైనా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే, ఆ ఫిర్యాదును జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిస్తాం. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం అని మండల విద్యాశాఖ అధికారి పద్మ తెలిపారు.



# 12లోపు 20 పంట కుంటలు 14లోపు గ్రామాభివృద్ధి ప్రణాళికలు

## తల్లాడలో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ.. అధికారులకు కీలక ఆదేశాలు



**తల్లాడ, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ విద్యాలత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీధర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండలంలోని గ్రామ పంచాయతీల పనితీరును సమీక్షించి, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ విద్యాలత మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 12వ తేదీ లోపు కనీసం 20 పంట కుంటలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు పంట కుంటలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి పురోగతి నివేదికలను సమర్పించాలని సూచించారు. అలాగే, ఈ నెల 14వ తేదీ లోపు అన్ని గ్రామ పంచాయతీలు సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల అవసరాలను గుర్తించి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, హరితహారం, ఉపాధి హామీ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఏనుకూరు భాగ్యశ్రీ, ఏపీడీ చలపతి, కల్లూరు డీఎల్‌పీఓ విజయలక్ష్మి, అదనపు పీడీ శిరీష, తల్లాడ ఎంపీవో హరికృష్ణ, ఏనుకూరు జీవీఎస్ నారాయణ, ఎస్‌బీఎం డీపీఎం అనూప్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తల్లాడ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వినోదాల హరివిల్లు.. సంతోషాల పెవిలియన్

**- ఖమ్మంలో వైభవంగా 'బటర్ ఫ్లై' ఎగ్జిబిషన్**

**- ప్రవేశ రుసుము కేవలం రూ. 50లు**


**- వచ్చే వారం నుంచి పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశ పాసులు!**

**- 'ఎగ్జిబిషన్' ఈనెల 7 నుంచి ఆగస్టు 30వ వరకు**

**- ఎగ్జిబిషన్ ముఖ్య నిర్వాహకులు గరిమెళ్ల జానకిరామయ్య**









**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆందోళనలు, ఒత్తిళ్లతో నిండిన దైనందిన జీవితంలో కాసేపు మనసును తేలికపరిచి, చిరునవ్వుల ఊయలలూగించేందుకు ఖమ్మం నగరం ఒక వర్ణరంజిత వేదికగా మారింది. చిన్నారుల కేరింతలు, పెద్దల ఆనంద భాష్పాలతో హృదయాలను ఆహ్లాదపరిచే వినోదాల హరివిల్లు బటర్ ఫ్లై ఎగ్జిబిషన్, ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో రూపుదిద్దుకుంది. ఎస్.కె ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'బటర్ ఫ్లై ఎగ్జిబిషన్' ఈనెల 7 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు నగరవాసులకు అపరిమిత ఆనందాన్ని పంచడానికి సిద్ధమైంది. ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ బటర్ ఫ్లై ఎగ్జిబిషన్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య నిర్వాహకులు గరిమెళ్ల జానకిరామయ్య మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ కేవలం ఆటపాటల ప్రదర్శన మాత్రమే కాదు, బాధ్యతల భారంతో అలసిపోయిన మనసులకు ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని అందించే ఒక హృదయపూర్వకమైన వేదిక అవుతుందన్నారు. ప్రతి ఒక్కరి బంధాలను మరింత బలపరిచేలా, ఆహ్లాదకర వాతావరణంలో అమూల్యమైన జ్ఞాపకాలను అందిస్తుందన్నారు. సకుటుంబ సమేతంగా గడిపే ప్రతి మధురక్షణం మనిషి ఆయుష్షును కూడా పెంచుతుందన్నారు. ఆత్మీయుల కలయిక, పసిపిల్లల నవ్వులు మానసిక ప్రశాంతతను అందించి ఆరోగ్యానికి కొత్త ఊపిరి పోస్తాయన్నారు. పిల్లల ముఖాల్లో విరిసే నవ్వులే ఈ సమాజానికి అసలైన అందం అన్నారు. చిన్నారుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు గొప్ప ఆకర్షణీయంగా నిలుస్తాయన్నారు. వచ్చే వారం నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉచిత ఎంట్రీ పాసుల సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా స్వయంగా ఆయా పాఠశాలల గుమ్మాల వద్దకు వెళ్లి విద్యార్థులకు ఉచిత ప్రవేశ పాసులను అందజేసి, చిన్నారుల హృదయాల్లో ఆనందాల వెలుగులు నింపనున్నామన్నారు. ఆర్థికభారం కాకుండా సామాన్యుడికి కూడా పూర్తిస్థాయి వినోదం అందాలనే ఉద్దేశంతో, ప్రవేశ రుసుమును కేవలం రూ. 50 లుగా నిర్ణయించామన్నారు. ఈ ప్రదర్శనలో సరికొత్తగా ఏర్పాటుచేసిన 'రోబోటిక్ బటర్ ఫ్లై' పరికరం ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. దీంతో పాటు సందర్శకులను మంత్రముగ్ధులను చేసే 12 అద్భుతమైన విభాగాలు అలరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సలాంబో, కొలంబస్, తోరా.. తోరా, కుటుంబ సమేత వినోదాలు : డ్రాగన్ ట్రైన్, మహారాజా ట్రైన్, చిన్నారుల ప్రత్యేక ఆకర్షణలు : వాటర్ బోట్, కార్లు, జంపింగ్, గుర్రాలు, బౌన్సర్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖమ్మం నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఈ ఎగ్జిబిషన్ ను సందర్శించి ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనుబంధ నిర్వాహకులు మొలుగూరి నాగేందర్, శిరీష, షేక్ జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం....





**చేనేత కార్మికుల కళానైపుణ్యం అమోఘం**

**బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్...**



**కరీంనగర్ ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్ 39వ డివిజన్ లోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం , నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గాన్ని నేసి, మగ్గం యొక్క పనితీరు తెలుసుకొని, చేనేత కార్మికుల అద్భుతమైన కళానైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం , కోలగాని శ్రీనివాస్ లు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేనేత కార్మికుల కళానైపుణ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడానికి, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు మార్కెటింగ్ కల్పించడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆ దిశలోనే 2015 ఆగస్టు 7 తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ ఉద్యమంలో చేనేత కార్మికులు అందించిన సేవలు, వారి పాత్ర ఎంతో గొప్పవని కొనియాడారు, ఈ కార్యక్రమంలో భాగంగా చేనేత అధ్యక్షులు, డైరెక్టర్లు, సంఘ సభ్యులను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల చంద్ర శేఖర్ తెళ్ళ రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, సరస్వతి సత్యం, గుంజెటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్ లతో పాటు చేనేత సంఘ సభ్యులు, డైరెక్టర్లు బోగా భద్రయ్య, చంద్రయ్య, గుర్రం ఆంజనేయులు, శ్రీపతి వెంకటేశం, తుమ్మ రామస్వామి, ఆరకాల కనకయ్య. భారీ సంఖ్యలో మహిళలు, చేనేత సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బుడిగం లక్ష్మీనారాయణ నియామకం

**● పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా: బుడిగం లక్ష్మీనారాయణ**



**సీరోల్, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడలుగా బుడిగం లక్ష్మీనారాయణను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నియమించింది. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, కార్యకర్తలతో ఉన్న అనుబంధం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్రను గుర్తించిన పార్టీ నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా బుడిగం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమామురళి నాయక్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని బుడిగం లక్ష్మీనారాయణ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి గౌరవాన్ని కాపాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమామురళి నాయక్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, బలహీన వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేసే దిశగా నిరంతరం పనిచేస్తానని ఆయన తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కమిటీలను బలోపేతం చేసి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని పేర్కొన్న ఆయన, మండలంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా సేవలందిస్తానని హామీ ఇచ్చారు.

# నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**● స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించి జోక్యం చేసుకోవాలి**

**● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



**రామడుగు ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన కొత్తూరి దుర్గయ్య (50)గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి దుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబానికి తక్షణ సహాయంగా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ..దుర్గయ్య మృతితో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గయ్యకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా, వారిలో ఒక కుమార్తె పీజీ చదువులు పూర్తి చేసిందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ తీసుకుని దుర్గయ్య కుటుంబానికి తక్షణ ప్రభుత్వ పరంగా అ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందించడంతో పాటు, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని కోరారు. కుటుంబంలోని పిల్లల విద్యకు ప్రభుత్వం అండగా నిలిచి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వారికి అండగా నిలవాలని అన్నారు. దుర్గయ్య కుటుంబానికి అవసరమైన సహాయం అందే వరకు సీపీఎం పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని మిల్కూరి వాసుదేవరెడ్డి స్పష్టం చేశారు. వారి వెంట జిల్లా కమిటీ సభ్యులు డి.నరేష్ పటేల్ మండల కన్వీనర్ ప్రభాకర్.నాయకులు ఇమానియల్, ప్రకాష్, ఐషాక్ కుమార్ తదితరులు ఉన్నారు

# అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఎన్నికలకు ముహూర్తం

**ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు**

**39 పదవులకు ఎన్నికలు.. ఎన్నికల షెడ్యూల్ విడుదల**

**హైదరాబాద్, ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** అఖిల గాండ్ల తెలికుల సంఘం తెలంగాణ (రిజి. నెం. 985/2014) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ విడుదల చేశారు. రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు మొత్తం 39 ఎగ్జిక్యూటివ్ కమిటీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సంఘం రాజ్యాంగం, ఎన్నికల నిబంధనల ప్రకారం షెడ్యూల్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 9, 2026 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు ఆగస్టు 11 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. అనంతరం ఆగస్టు 12న నామినేషన్ల పరిశీలన నిర్వహించనుండగా, ఆగస్టు 18 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన అనంతరం ఆగస్టు 23, 2026న హైదరాబాద్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘ సభ్యులు ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో పాల్గొని, అర్హులైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణలో సభ్యులందరూ సహకరించి, ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలు, నామినేషన్ ప్రక్రియ, అర్హతలు, నియమావళి తదితర సమాచారం కోసం ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ను 99496 39015 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ – నామినేషన్ల ప్రారంభం: 09-08-2026– నామినేషన్ల ముగింపు: 11-08-2026– నామినేషన్ల పరిశీలన: 12-08-2026– నామినేషన్ల ఉపసంహరణ: 18-08-2026– పోలింగ్: 23-08-2026 (హైదరాబాద్)"ప్రజాస్వామ్య పద్ధతిలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని సంఘ అభివృద్ధికి తోడ్పడాలి." అని ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వెన్నంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రవి నాయక్ నియామకం

**- ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత గుర్తింపు లభిస్తోంది ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌కు రవి నాయక్ కృతజ్ఞతలు**



**మరిపెడ, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రవి నాయక్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమామురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని, ముఖ్యంగా ఎస్టీ వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం అభినందనీయమని రవి నాయక్ పేర్కొన్నారు. గిరిజన సమాజానికి రాజకీయంగా మరింత గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ నాయకత్వం ఆదర్శనీయమని కొనియాడారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరిపెడ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేసి, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రవి నాయక్ స్పష్టం చేశారు. యువత, మహిళలు, రైతులు, గిరిజనులు, బలహీన వర్గాలను కాంగ్రెస్ పార్టీ వైపు మరింత ఆకర్షించే విధంగా కార్యాచరణ రూపొందించి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రవి నాయక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మరిపెడ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# బుడ్డోడి కోరికతో కదిలిన ప్రభుత్వం

**యర్రబోయినపల్లికి ఆర్టీసీ బస్సుకు గ్రీన్ సిగ్నల్..**

**ప్రజాదర్బార్‌లో చిన్నారి విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పొంగులేటి**

**గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్టీసీ అధికారులు**

**త్వరలోనే బస్సు సర్వీసులు ప్రారంభిస్తామని డిపో మేనేజర్ హామీ**



**కల్లూరు, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నో ఏళ్ళుగా ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న యర్రబోయినపల్లి గ్రామ ప్రజల ఆశలు ఫలించే దశకు చేరుకున్నాయి. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. త్వరలోనే చెన్నూరు నుండి యర్రబోయినపల్లి, లింగాల మార్గంలో బస్సు సర్వీసులు ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది. కల్లూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో యర్రబోయినపల్లికి చెందిన ఓ చిన్నారి మా ఊరికి బస్సు కావాలి సార్ అంటూ చేసిన విజ్ఞప్తి అందరినీ ఆకట్టుకుంది. చిన్నారి అభ్యర్థనకు స్పందించిన మంత్రి వెంటనే ఆర్టీసీ అధికారులను గ్రామంలో బస్సు సర్వీసు ప్రారంభించే అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం మధిర డిపో మేనేజర్ గ్రామాన్ని సందర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ దొడ్డపునేని శ్రీనివాసరావుతో కలిసి చెన్నూరు నుంచి యర్రబోయినపల్లి మీదుగా లింగాల వరకు బస్సు నడిపేందుకు అవసరమైన రహదారి పరిస్థితులు, ప్రయాణికుల అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించిన డిపో మేనేజర్, తన నివేదికను మధిర డిపో రీజినల్ మేనేజర్‌కు పంపించి త్వరలోనే బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని కల్లూరు, మధిర మార్గంలో ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1 గంట సమయంలో, సాయంత్రం 5 లేదా 6 గంటల సమయంలో బస్సు నడిపేలా ప్రతిపాదన రూపొందిస్తామని వెల్లడించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ సైదులు, నల్లగట్ల పుల్లయ్య, కొలికపోగు కృష్ణ, గూడ జోజి, నల్లగట్ల గోపాలకృష్ణ, తాళ్ల భూషణం తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన సీఐపై చర్యలు తీసుకోవాలి



**హైదరాబాద్,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆస్తి వివాదంలో సనత్ నగర్ సీఐ అశోక్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితుడు ప్రేమ్చందరు వేదింపులకు గురిచేస్తున్నాడని ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్ రావు గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు సీఐ అశోక్ పై చట్టరిత్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్ ను నాగేశ్వర్ రావు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ చంద్ ఆస్తి విషయంలో స్పష్టమైన హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి వాటిని సీఐ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. ఆస్తి విషయంలో ప్రేమ్ చంద్ కు చట్టబద్ధంగా హక్కులు ఉన్నప్పటికీ ఆ ఆస్తిలోకి ప్రేమచంద్ వెల్లకుండా సీఐ అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. సీఐ హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడం, పోలీస్ అధికారాన్ని దుర్వినియోగం, తప్పుడు క్రిమినల్ కేసులు నమోదు చేసినందుకు సీఐ పై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పెన్షన్లు దయ కాదు... మా హక్కు!

**- రిటైర్డ్ ఉద్యోగుల కడుపుకోత తీర్చండి!**

**- పిఆర్సి ప్రకటించి, పెండింగ్ డిఆర్‌లు తక్షణమే విడుదల చేయాలి**

**- వయోవృద్ధుల ఆవేదనను ఆలకించకపోతే పోరాటాలు తప్పవు**

**- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. మేరిఏసుపాదం, జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య**




ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజలకు అంకితభావంతో పనిచేసిన పెన్షనర్ల సమస్యలను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, పెన్షన్లు దయ కాదు... మా హక్కు అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి వి. మేరి ఏసుపాదం, జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. జీవిత చరమాంకంలో గౌరవప్రదమైన జీవనం గడపాల్సిన పెన్షనర్లు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు డీఆర్ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగ విరమణ అనంతరం చెల్లించాల్సిన అన్ని బకాయిలను వెంటనే అందజేయాలని, ప్రతి పెన్షనర్‌కు హెల్త్ కార్డులు జారీ చేసి ప్రభుత్వ హామీ మేరకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యేకోపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయడంతో పాటు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన మహాధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది పెన్షనర్లు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని నాయకులు తెలిపారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో చివరి మార్గంగా ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పెన్షనర్లు ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదని, ప్రభుత్వం ఇవ్వాల్సిన చట్టబద్ధమైన మా హక్కులను మాత్రమే కోరుతున్నారని ఎస్జిపిఏటి నాయకులు స్పష్టం చేశారు. ఉద్యమాలు మరింత ఉధృతం కాకముందే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెన్షనర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మహాధర్నాకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి వి. మేరి ఏసుపాదం, జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ నాయకత్వం వహించారు. ఈ మహాధర్నాలో ఎస్జిపిఏటి నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, కన్నెకంటి కృష్ణమూర్తి, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణ మూర్తి, మధుకర్ రెడ్డి, ఊడుగు సుధాకర్, యండి హుస్సేన్, ప్రసాదరావు, మనోహరరాజు, నాగిరెడ్డి, వీరభద్రరావు, కమల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**• చేనేత కార్మికుల కళానైపుణ్యం అమోఘం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



**కరీంనగర్ ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ నగరంలోని 39వ డివిజన్‌లో ఉన్న చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై స్వయంగా నేయడం ద్వారా మగ్గం పనితీరును తెలుసుకుని, చేనేత కార్మికుల అద్భుతమైన కళానైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత కార్మికుల ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడానికి, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆ కృషిలో భాగంగానే 2015 ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమంలో చేనేత కార్మికులు అందించిన సేవలు చారిత్రాత్మకమైనవని కొనియాడారు. చేనేత రంగం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, సభ్యులను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, తెళ్ళ లక్ష్మి రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, బీజేపీ నాయకులు గుంజేటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు ,మహిళలు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యాది మరిస్తే జనం సహించరు!

**- కదిలిన కదం...**

**పెల్లుబికిన ప్రజా చైతన్యం!**

**- ఎన్నికల హామీలు అమలు చేసే వరకు విశ్రమించేది లేదు**

**- సీపీఐ జాతీయ నేత బాగం హేమంతరావు హెచ్చరిక**

**- గ్రామ గ్రామాన హారతులు, డప్పు దళాలతో ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి ప్రాంతాల్లో ఘన స్వాగతం**






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** “పాలకులు అధికారం చేపట్టినంత మాత్రాన ఇచ్చిన మాటను విస్మరిస్తే ఊరుకునేది లేదు... యాది మరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు“ అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పాలకులను తీవ్రంగా హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, హామీల అమలే లక్ష్యంగా సాగుతున్న ‘ప్రజా చైతన్య యాత్ర’ ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో శుక్రవారం హోరెత్తింది. ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతూ, హృదయాలను హత్తుకునేలా సాగిన ఈ పాదయాత్రకు గ్రామ గ్రామాన లభించిన నీరాజనం ప్రజాక్షేత్రంలో రూపుదిద్దుకుంటున్న చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. ప్రజా చైతన్య యాత్ర ఏ గ్రామంలోకి ప్రవేశించినా జనం తండోపతండాలుగా ఎదురేగి స్వాగతం పలికారు. పూలవర్షం, హారతులు, డప్పు దెబ్బల మోతలు, కోలాటాల నడుమ యాత్ర అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. నిరుద్యోగులు, రైతులు, పేద మహిళలు తమ ఆవేదనను నేతలతో పంచుకోగా, వారి గుండెచప్పుడుగా నాయకులు నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రసంగిస్తూ... కేంద్ర ప్రభుత్వం ద్వారా నల్లధనం వెనక్కి తెచ్చి ఖాతాల్లో వేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయని దుయ్యబట్టారు. కార్పొరేట్లకు ప్రభుత్వ రంగాన్ని కట్టబెడుతూ, వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెట్టే ప్రయత్నాలను నిరసించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు రుణమాఫీ అరకొరగానే మిగిలిందని, రైతు బీమా, పంటల బీమా లేక కర్షకులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు, సన్న బియ్యంతో సరిపెట్టకుండా మహిళలకు రూ.2,500 సహాయం, తులం బంగారం, ఇందిరమ్మ భరోసా వంటి హామీలను తక్షణమే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం కాకుండా, పాలకుల కళ్ళు తెరిపించి ప్రజా సమస్యలు తీర్చేందుకే ఈ చైతన్య యాత్ర చేపట్టామని నాయకులు స్పష్టం చేశారు. ఈ మహోద్యమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, సింగు నర్సింహారావు, పోటు కళావతితో పాటు పలు అనుబంధ సంఘాల నాయకులు, వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానం పై దృష్టి పెట్టాలి**

**- వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం తో పంట మార్పిడి విధానాల వల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని, రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానాలు పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టిన పంట కుంటలు, బోర్ రీచార్జ్, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్ర మాన్ని మంచి వాతావరణంలో, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి చౌక ధరల దుకాణం పరిధిలో కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, పంపిణీ తేదీ, సమయం, వేదిక, డీలర్ల వివరాలతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పంపిణీ కేంద్రానికి ఒక బాధ్యత గల అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సౌకర్యార్థం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు, వైద్యాధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో కూడా ప్రజలు ఒకేచోట అధిక సంఖ్యలో చేరకుండా గ్రామపంచాయతీ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ఆయకట్టు సాగు, తాగునీటి అవసరాలపై కూడా సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని మేజర్, మీడియం, మైనర్ చెరువుల నీటి నిల్వలపై పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలోని చెరువుల్లో నీటిని తాగునీరు, పశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నీటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సందేశం అందించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వివరాలు తెలిపేందుకు గ్రామీణ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ శాఖ రైతులకు పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్వో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఆర్డీఏ శ్రీరాం, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మనోహర్, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అభినందన సభను విజయవంతం చేయాలి

**● ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు తిరునగరి వేంకటాద్రి స్వామి పిలుపు**

**కరీంనగర్ జిల్లా,ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ వ్యాప్తంగా 6700 మంది ధూప దీప నైవేద్య అర్చకులు కలరు వీరికి రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒకటవ తేదీన గౌరవ వేతనం వేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవ రేవంత్ రెడ్డి గారికి శ్రీమతి కొండ సురేఖ గారికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శైలజ రామాయ్యారు గారికి దేవాలయ శాఖ కమిషనర్ హనుమంతరావు గారికి ధన్యవాదములు తెలుపుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు వెయ్యి మంది అర్చకుల తరపున ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 8వతేది శనివారం రోజున మధ్యాహ్నం 1 గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అభినందన పూర్వక సభను కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా ఉన్న కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వెంకటాద్రి స్వామి గారు తెలిపారు ఈ సందర్భంగా అర్చకులు అందరూ ఈ సమావేశానికి విచ్చేసి భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు ఒక ప్రణాళిక తో ప్రభుత్వం ద్వారా మనం సంఘటితంగా ఉంటూ అర్చకుల జీవితాలను బాగుపరుచుకునే విధంగా ఉద్యోగ భద్రత సాధించుకోవడానికి అర్చక జేఏసీ అధ్యక్షులు గౌరవ ఉపేంద్ర శర్మ గారు ఈ సమావేశానికి వస్తున్నారు . కావున అర్చకులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాల్సిందిగా తెలియజేస్తున్నాం

## కరీంనగర్‌లో ఘనంగా విమలక్క జన్మదిన వేడుకలు...

**- అనాథ వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి అన్నప్రసాదం పంపిణీ**



**కరీంనగర్ ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) చైర్‌పర్సన్, తెలంగాణ ఉద్యమ గాయని, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు కామ్రేడ్ విమలక్క జన్మదినాన్ని పురస్కరించుకుని టఫ్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ నగరంలోని వీబీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనాథ వృద్ధుల ఆశ్రమంలో టఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, మాజీ జిల్లా కార్యదర్శి బిజిగిరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఆశ్రమంలోని వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విమలక్క తన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని వర్గాలను ఏకం చేస్తూ తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ద్వారా ఆమె నిరంతరం ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కూడా బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం విమలక్క ప్రజల్లోనే ఉంటూ పోరాటాలు సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆమె చేస్తున్న కృషి ఆదర్శనీయమని, ప్రజా ఉద్యమాల్లో ఆమెకు అండగా నిలవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. విమలక్క సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, భవిష్యత్తులోనూ ప్రజా హక్కుల సాధన కోసం తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లె నారాయణ గౌడ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలర్ సత్తన్న, ఉద్యమకాల ఫోరం కరీంనగర్ అధ్యక్షుడు గొడిశాల రమేష్ గౌడ్, కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు లింగంపల్లి సత్యనారాయణ, రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి... దేశభక్తిని చాటి చెప్పండి....

**'హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం లను సక్సెస్ చేయండి....**

**బీజేపీ రాష్ట్రకార్యసభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి..**




**కరీంనగర్ ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆగస్టు 15న జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తలపెట్టిన హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం, 'తిరంగా యాత్ర' లను సక్సెస్ చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మహాత్మా నగర్ లోని శ్రీతపాలా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణ మండపంలో హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ తిరంగా యాత్ర నిర్వహణ కోసం బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలని, దేశభక్తిని చాటేలా ఈ నెల 10 నుండి దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాములు ప్రారంభం అవుతాయని తెలిపారు. మండల పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ప్రోగ్రామ్ లను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టి, ప్రజలు విద్యార్థులు ఇట్టి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. అలాగే ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషుల, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు శుద్ధి చేసి , స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాములు ప్రతి ఏటా ఘనంగా జరుగుతున్నాయని నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

**అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు రెపరెపలాడాలి.. చింతం శ్రీనివాస్..** హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు ప్రతి ఇంటిపై ఎగరాలని , ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ నిబంధనల వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ అర్హతల నిబంధనలు పేదలు, వృద్ధులు, వితంతు మహిళలు మరియు నిజమైన అర్హుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా 70 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం అత్యంత అన్యాయమైన నిర్ణయం అన్నారు. 57 సంవత్సరాల వయస్సు దాటిన ఎంతో మంది పేద వృద్ధులు పని చేయలేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిని పెన్షన్‌కు దూరం చేయడం దారుణమన్నారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సును 70 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వితంతు మహిళలకు 40సంవత్సరాల వయోపరిమితి విధించడం కూడా పూర్తిగా అన్యాయమని , భర్తను కోల్పోయిన మహిళ ఏ వయస్సులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, వితంతు పెన్షన్‌కు ఎలాంటి వయోపరిమితి లేకుండా అర్హులైన ప్రతి వితంతు మహిళకు పెన్షన్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోకపోతే, ఈ అన్యాయమైన నిబంధనలను ఉపసంహరించుకోకపోతే, భారతీయ జనతా పార్టీ తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కల్యాణ్ చంద్ర , జిల్లా ఈసీ మెంబర్ మావురపు సంపత్ మండల జనరల్ సెక్రెటరీ గొట్టిముక్కల తిరుపతిరెడ్డి , సీనియర్ నాయకులు పాశం రాఘవరెడ్డి ,ఎర్రోజు లక్ష్మణ్ ,ఎలుక పెల్లి స్వామి, బుర్ర శ్రీనివాస్ ,పడాల శ్రీను, విశ్వరూప చారి బూత్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి ,రాపర్తి రవీందర్, నరేషు ,గంటూ రాజు ,పిట్ట మహేశ్ మాడిశెట్టి నరేష్ ,బుడిగ మహేష్ కుమార్ ,మహేందర్ రెడ్డి, జక్కోజు అనిల్ ,బూరుగు శ్రీనివాస్ రెడ్డి, కామర వెంకటేష్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరం మండలంలో గ్రామసభ నిర్వహణ

**- చిరుధాన్యాలు,పామాయిల్ సాగుపై రైతులకు అధికారుల సూచనలు.**



**గన్నేరువరం,ఆగస్టు7(పీసీడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండలంలోని యాస్వాడ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధికారి, వ్యవసాయ శాఖ వ్యవసాయ అధికారి (ఏవో), వ్యవసాయ ఇంజినీరింగ్ శాఖ సహాయ ఇంజినీర్ (ఏఈ) పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో తక్కువ నీటితో సాగు చేయగల చిరుధాన్యాల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అలాగే పామాయిల్ తోటల సాగు ద్వారా రైతులకు అధిక దిగుబడితో పాటు మెరుగైన ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి మాట్లాడుతూ, అధికారులు సూచించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గువ్వల సత్యం, గ్రామ రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ హ్యాండ్లూమ్ దినోత్సవం విద్యార్థుల విద్యా విహారం



**రామడుగు,ఆగస్టు7(పీసీడబ్ల్యూ న్యూస్):** జాతీయ హ్యాండ్లూమ్ దినోత్సవం సందర్భంగా శ్రీ ప్రగతి హై స్కూల్, గోపాల్‌రావుపేటకు చెందిన 5వ తరగతి విద్యార్థులు గోపాల్‌రావుపేట గ్రామంలోని పవర్‌లూమ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వస్త్రాల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, నూలు నుంచి వస్త్రం తయారయ్యే ప్రతి దశను ఆసక్తిగా తిలకించారు. అలాగే, పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు, వారి శ్రమ, నైపుణ్యం గురించి తెలుసుకొని వారిపట్ల గౌరవ భావాన్ని పెంపొందించుకున్నారు. ఈ విద్యా విహారం ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అనుభవంతో ఎన్నో కొత్త విషయాలను నేర్చుకొని ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నేరెళ్ల అజయ్ , పద్మ మేడం, అలాగే పద్మశాలి యువజన సంఘం సభ్యులు కొలిపాక కమలాకర్ పాల్గొని విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందించారు. ఈ సందర్భంగా వస్త్రాల తయారీ దారులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను ఘనంగా సన్మానించారు.

# కాంగ్రెస్ సర్కార్ కొత్త పెన్షన్ నిబంధనలపై కదం తొక్కిన శంకరపట్నం బీజేపీ ..

**కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై బైఠాయింపు.. ఆందోళన**

**కొత్త పెన్షన్ నిబంధనలతో**

**పేదలకు తీవ్ర అన్యాయం..**

**నిబంధన పేరిట పెన్షన్లలో**

**కోత పెడితే ఊరుకోం....**

**బీజేపీ నేతలు మాడ వెంకటరెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, ఏనుగుల అనిల్**





**శంకరపట్నం ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ సర్కార్ కొత్త పెన్షన్ నిబంధనలను మార్పు చేయాలని , అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్ర వారం రోజున కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి వద్ద ఆందోళన చేపట్టి బైఠాయించారు. కొత్త నిబంధన ప్రతులను దాహనం చేశారు.. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి , మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ లు మాట్లాడుతూ ప్రత్యేకంగా 70 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం అత్యంత అన్యాయమైన నిర్ణయం అన్నారు. 57 సంవత్సరాల వయస్సు దాటిన ఎంతో మంది పేద వృద్ధులు పని చేయలేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, . అలాంటి వారిని పెన్షన్‌కు దూరం చేయడం సంక్షేమ ప్రభుత్వ లక్ష్యానికి విరుదం అన్నారు.వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సును 70 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే వితంతు మహిళలకు 40 సంవత్సరాల వయోపరిమితి విధించడం కూడా పూర్తిగా అన్యాయమని, . భర్తను కోల్పోయిన మహిళ ఏ వయస్సులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని, . అందువల్ల వితంతు పెన్షన్‌కు ఎలాంటి వయోపరిమితి లేకుండా అర్హులైన ప్రతి వితంతు మహిళకు పెన్షన్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం ప్రకటించిన అర్హత నిబంధనలను కూడా పునఃసమీక్షించి, నిజమైన పేదలకు న్యాయం జరిగేలా తక్షణమే సవరణలు చేయాలని ఆయన బీజేపీ శంకరపట్నం మండల శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, నాయకులు దొంగల రాములు, జంగ జైపాల్, కొయ్యడ అశోక్, దాసారపు నరేందర్, నిమ్మశెట్టి సంపత్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, ఎల్కపెల్లి సంపత్, మందాడి జగ్గారెడ్డి, కనకం కుమార్, పడాల వెంకటలక్ష్మి, లోకి కుమార్ ,చెర్ల శ్రీనివాస్, గూళ్ల రాజు, లక్ష్మి ,బోడ తిరుపతిరెడ్డి, రాజేందర్, వెంగళ ప్రవీణ్, మండల్ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ బిడ్డ పెట్టేం నవీన్‌కు కీలకమైన తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ బాధ్యతలు







**కరీంనగర్ ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణానికి చెందిన పెట్టేం నవీన్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్‌గా కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.గతంలో రాష్ట్ర సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పనిచేసిన పెట్టేం నవీన్, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సోషల్ మీడియా వేదికగా ప్రతి జిల్లా లో నిత్యం సంబంధిత జిల్లా కార్యకర్తలతో సమావేశంలు నిర్వహిస్తూ కష్టపడి పనిచేశారు.ఈ సందర్భంగా పెట్టేం నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరువ చేస్తానని పేర్కొన్నారు.

# చరిత్రకు వారసులు.. విద్యలో అగ్రగాములు...

**కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ కళాశాల విజయ ప్రస్థానం పై ప్రత్యేక కథనం...**




**కరీంనగర్ ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని చారిత్రాత్మక మరియు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ జూనియర్ కళాశాల విజయగాథ ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం. 1969లో స్థాపించబడిన ఈ కళాశాల, తన సుసంపన్నమైన వారసత్వాన్ని ఆధునిక విద్యా ప్రమాణాలతో మేళవిస్తూ విజయపథంలో సాగుతోంది.ఈ విద్యాసంస్థ కేవలం చదువులకే పరిమితం కాకుండా, దేశానికే గర్వకారణమైన మహనీయులను ఎందరినో ఈ దేశానికి అందించింది. భారత మాజీ ప్రధాని, భారతరత్న పి.వి. నరసింహారావు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి (సినారె), ఓపెన్ లెర్నింగ్ పితామహుడు ప్రొ. జి. రాంరెడ్డి, మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి ప్రముఖులు ఈ కళాశాల నుంచి రూపుదిద్దుకున్నవారే.ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ స్థానం సాధించి ఈ కళాశాల మరోసారి తన సత్తా చాటుకుంది. 2026-27 విద్యా సంవత్సరంలో ఈ కళాశాలలో 715 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 26 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించి అద్భుతం సృష్టించారు.ఈ విజయాల పరంపరలో విద్యార్థులు వ్యక్తిగతంగా కూడా అసాధారణ ప్రతిభ కనబరిచారు. శ్రీరమణి 1000 మార్కులకు గాను 994 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో మస్రహా మహవీన్ 438/440 మార్కులతో, జహా మహవీన్ 435/440 మార్కులతో ప్రతిభ కనబరిచారు. అలాగే మొహమ్మద్ రాయాన్ దస్తగిర్ 991/1000 మార్కులు సాధించడంతో పాటు, ఏప్‌సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2147వ ర్యాంక్ సాధించి తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకును నమోదు చేశారు.ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఏఈసీ కోర్సులతో పాటు పలు వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఆధునిక ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ మరియు కంప్యూటర్ ప్రయోగశాలల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన, ఆచరణాత్మక విద్యను అందిస్తున్నారు. చదువుతో పాటు ఎన్ఎస్ఎస్, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు.ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. సత్యవర్ధన్ రావు సమర్ధ నాయత్వంలో ఈ కళాశాల విద్య రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోంది. “చరిత్ర గొప్పదైతే గర్వం కలుగుతుంది... విద్య గొప్పదైతే భవిష్యత్తు వెలుగుతుంది“ అనే నానుడికి ఈ కళాశాల అక్షరాలా నిలువెత్తు రూపంగా నిలుస్తోంది.రంగు విశ్వ సాయి,(జూనియర్ లెక్చరర్ ఇన్ మ్యాథమెటిక్స్,,గవర్నమెంట్ జూనియర్ కళాశాల, ఆర్ట్స్ అండ్ కామర్స్,కరీంనగర్.)...

# అక్షర బట్టర్ ఫ్లైస్కూల్ బూరుగుపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు




**గంగాధర ఆగస్టు 7(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోఈ రోజు తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకైన బోనాల పండుగను అక్షర బట్టర్ ఫ్లై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు.‘పిల్లలు భక్తి శ్రద్ధలతో అలంకరించిన బోనాలతో హాజరయ్యారు.అబ్బాయిలు పోతరాజుల, పులి వేషాలతో డాన్స్ లు చేస్తూ ఆకట్టుకున్నారు.బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ బోనాలను పోచమ్మ కు చెల్లింపు చేశారు.బోనాల ప్రాముఖ్యతను మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ గారు వివరించారు.పిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమములో విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

# పాముకాటుకు భయపడొద్దు.. అప్రమత్తతే ప్రాణరక్షణ

- **వర్షాకాలంలో రైతులు, కూలీలు మరింత జాగ్రత్తగా ఉండాలి**
- **ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స, యాంటీ స్నేక్ వెనం**
- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దనాలకోట రామారావు**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వర్షాకాలం ప్రకృతి అందాలను పంచడమే కాదు... కొన్ని ప్రమాదాలకు కూడా తెరతీస్తుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పాములు, ఇతర విషకీటకాలు తమ బొరియలు, నివాస ప్రాంతాల నుంచి బయటకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దనాలకోట రామారావు సూచించారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాము కాటు చికిత్సకు అవసరమైన యాంటీ స్నేక్ వెనం (ఏఎస్వి) ఇంజెక్షన్లు, ఇతర అత్యవసర మందులు తగినంత నిల్వలో ఉన్నాయని తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా, పాము కాటు సంభవించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంటే ప్రాణాలను సులభంగా కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు మాట్లాడుతూ... “పాము కాటు కంటే భయం ఎక్కువ ప్రమాదకరం“ అని అన్నారు. కాటు పడిన వ్యక్తిని ధైర్యంగా ఉంచడం అత్యంత ముఖ్యమని, భయంతో గుండె వేగం పెరగడం వల్ల విషం శరీరంలో త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుందని వివరించారు.వ్యవసాయ పనులు చేసే సమయంలో కాళ్లకు ఎత్తైన బూట్లు, చేతులకు గ్లౌజులు ధరించాలని, గడ్డి కోయడం, పొదల్లో పనిచేయడం, రాళ్ల గుట్టలు, చెట్ల తొర్రలు, పాత వస్తువుల దగ్గర చేతులు పెట్టే ముందు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో పొలాలు, బావుల వద్దకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టార్చ్‌లైట్ వెంట తీసుకెళ్లాలని, దట్టమైన గడ్డి, పొదల్లో నడిచేటప్పుడు కర్రతో నేలను తడుతూ శబ్దం చేస్తే పాములు దూరంగా వెళ్లే అవకాశముందని చెప్పారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా పాముల నివారణలో కీలకమని పేర్కొన్నారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేయాలని, ధాన్యం నిల్వల వద్ద ఎలుకలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలుకల కోసం పాములు నివాస ప్రాంతాలకు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పాము కాటుకు గురైనప్పుడు మంత్రాలు, మూలికలు, నాటు వైద్యం వంటి అపోహలను నమ్మి విలువైన సమయాన్ని వృథా చేయొద్దని ఆయన స్పష్టం చేశారు. కాటు వేసిన ప్రదేశంలో కోతలు పెట్టడం, నోటితో విషాన్ని పీల్చే ప్రయత్నం చేయడం, రక్తప్రసరణ ఆగిపోయేలా గట్టిగా కట్టు కట్టడం వంటి చర్యలు ప్రాణాపాయాన్ని మరింత పెంచుతాయని హెచ్చరించారు.బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కాటు వేసిన చేయి, కాలును ఎక్కువగా కదలకుండా నిశ్చలంగా ఉంచి, వీలైనంత త్వరగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వైద్యుల పర్యవేక్షణలో సమయానికి చికిత్స అందితే అత్యధిక సందర్భాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము కాటు బాధితులకు అవసరమైన ఉచిత వైద్యం, యాంటీ స్నేక్ వెనం ఇంజెక్షన్లు, అత్యవసర చికిత్స నిరంతరం అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దనాలకోట రామారావు విజ్ఞప్తి చేశారు.

# 10న జైల్ భరోను జయప్రదం చేయండి




**- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 10న జరిగే జైల్భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐక్య రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. అఖిలపక్ష రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ -రంగాన్ని మరింత సంక్షోభం దిశగా నడిపేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. నూతన సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రిక పోరాట నేపథ్యంలో ఉపసంహరించుకున్నట్లు మోడీ ప్రభుత్వం ప్రకటించిన దొడ్డి దారిన వాటి అమలుకు పూనుకుంటుందని నేతలు ఆరోపించారు. సాగు చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు మోడీ, ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ పేదలు ఆధారపడిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబిజి రాం జీ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిందని దీని ద్వారా క్రమేపి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. కార్పొరేట్ కనుసన్నల్లో పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం వారికి అనుగుణంగా పని గంటల పెంపు క్రమంలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు అమల్లోకి తీసుకు వచ్చిందన్నారు. వీటిని రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశ ప్రజల పక్షాన డిమాండ్ చేస్తుందన్నారు. మొత్తంగా మోడీ విధానాలను నిరసిస్తూ జరిగే ఈ జైల్భరో కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ, ప్రజా సంఘాల పక్షాన కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, కాంగ్రెస్ పక్షాన తుమ్మల యుగంధర్, యరగర్ల హన్మంతరావు, నరాల నరేష్, ఖాదర్బాబా, సిపిఎం ప్రజా సంఘాల పక్షాన పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వ రరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యర్రా శ్రీను, వై. విక్రం, బిఆర్ఎస్ నాయకులు ఎండివై పాషా, మాస్ లైన్ ప్రజా సంఘాల నాయకులు రామయ్య, బందెల వెంకయ్య, ఇమ్మడి హన్మంతరావు, న్యూడెమో క్రసీ పక్షాన ప్రకాష్, ఐ. వెంకన్న పాల్గొన్నారు.